క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగితీగల చోరీ

• రైతుల సాగునీటికి ఇబ్బంది

పొదలకూరు : మండలంలోని దుగ్గుంటరాజుపాళెం గ్రామానికి సమీపంలో తెలుగుగంగ కాలువ పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని రాగితీగను చోరీ చేసినట్లు మంగళవారం రాత్రి రైతులు, సిబ్బంది గుర్తించారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. సుమారు రూ.లక్ష విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న రాగివైరును అపహరించుకుని వెళ్లారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 8 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ మోటార్ల ద్వారా 30 ఎకరాల వరిపైరుకు రైతులు సాగునీటిని పెట్టుకుంటున్నారు. కాగా దీనిపై కండలేరు డ్యామ్ పోలీస్‌స్టేషన్లో విద్యుత్ సిబ్బంది ఫిర్యాదు చేశారు. వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



నిందితుడు, ట్రాక్టర్‌తో సీఐ బాలకృష్ణ, సిబ్బంది

ఇందుకూరుపేట : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని ముదివర్తిపాళెం గ్రామ సమీపంలో బుధవారం సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ బాలకృష్ణ తెలిపారు. నిందితుడు కార్తీక్‌తో పాటు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను స్థానిక సివిల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పినట్లు ఆయన వివరించారు.

నేత్రదానం



కమలమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కమలమ్మ (68) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన మోటివేటర్లు బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీసింగ్ కోరారు.

టౌన్‌ప్లానింగ్‌లో చైన్‌మెన్ల బదిలీ

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు చైన్‌మెన్లను బదిలీ చేస్తూ కమిషనర్ హరిత ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. శశికల్యాణ్‌ను కమిషనర్ పేషీకి, వెంకటరమణను టీపీఆర్వో సెక్షన్‌కు, నారాయణను పబ్లిక్ హెల్త్ విభాగానికి, మల్లికార్జునరావు, దస్తగిరిబాషా, బాబూరావును ఇంజినీరింగ్ విభాగానికి, శేషారెడ్డిని హెచ్ విభాగానికి బదిలీ చేశారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

• నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడిపందేలు, అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తే చర్యలు తప్పవని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలను రోజూ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. గస్తీని ముమ్మరం చేశామని, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘాను పెంచామన్నారు. రోజూ రాత్రి వారిని తనిఖీ చేస్తామని, నేరాలకు తరచూ పాల్పడుతున్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నామని.. త్వరలోనే వారిపై రౌడీషీట్లను తెరవనున్నామని చెప్పారు. నిరంతరం తనిఖీలు చేస్తూ బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్న వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా ఊళ్లకెళ్లే వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒంటరిగా బయటకెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు కనిపించకుండా జాగ్రత్తలు వహించాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిసినా డయల్ 100, 94407 96303 లేదా స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. నేర నియంత్రణకు తాము చేపడుతున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'

• అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు
• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీని ద్వారా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంటలో మంత్రి కాకాణి బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక చింతాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ప్రతిఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటివద్ద మంత్రి కాకాణికి మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికి, ఎన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా అందుతున్నాయా.. లేదా అని తెలుసుకుని, వివిధ కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో ఎవరికీ సాధ్యం కానీ విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. చెముడుగుంట గ్రామంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, ఏడుకొండలు, సర్పంచ్ రాములమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు రాచాల రవికుమార్‌యాదవ్, కప్పిర సూరి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో బ్రెయిలీ డే



కొడవలూరు : బ్రెయిలీ డేపై అవగాహన కల్పిస్తున్న ఐఈఆర్టీలు సునీత, హైమావతి

కొడవలూరు : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల పిల్లలు, తల్లిదండ్రులకు బుధవారం బ్రెయిలీ డే ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ఐఈఆర్టీ ఎం.సునీత మాట్లాడుతూ అంధులకు వెలుగులు చూపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. ప్రమాదవశాత్తు చిన్న వయస్సులోనే అంధుడిగా మారిన లూయిస్ బ్రెయిలీ దృష్టిలోపం ఉన్నవారు సులువుగా చదువుకునేలా బ్రెయిలీ లిపిని కనుగొన్నారని చెప్పారు. ఈ లిపినే ప్రపంచంలోని అన్నిదేశాల వారు ఉపయోగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ టి.హైమావతి, ప్రత్యేక అవసరాల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: ప్లేట్లు అందజేస్తున్న దాతలు

ప్లేట్లు పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు బుధవారం ప్లేట్లు, వాటర్‌బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ నరసింహారావు హాజరై, మాట్లాడారు. లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా సహార ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్లేట్లు, వాటర్‌బాటిల్స్‌ను పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యస్దానిబాషా, ఎంఈఓ దిలీప్, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వవ్వేరు బ్యాంకుపై ఆరోపణలు తగదు

• చైర్మన్ నూరా శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : వవ్వేరు రూరల్ కోఆపరేటివ్ బ్యాంకుపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆ బ్యాంక్ చైర్మన్ నూరా శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకులో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు నష్టాల్లో ఉందని, రైతులకు నష్టం కలుగుతోందని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఇప్పటికీ ఈ బ్యాంకు రూ.18 కోట్ల లావాదేవీలు చేస్తోందని తెలిపారు. రూ.20 కోట్ల మేర సొంత నిధి కలిగి ఉందన్నారు. తాను చైర్మన్ పదవి చేపట్టే నాటికి బ్యాంకు నికర ఆదాయం రూ.60 లక్షలు ఉండగా నేడు రూ.4 కోట్లు ఉందని తెలిపారు. బ్యాంకులో అవకతవకలు జరిగాయని వివిధ పత్రికల్లో రావడంపై ఉన్నతాధికారులు విచారణ చేశారని, అందులో ఎలాంటి అవకతవకలు జరగలేదని తేల్చినట్లు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు త్రిసభ్య కమిటీ సభ్యులు కోవూరు మురళీ, దాసరి శ్రీహరి, మేనేజర్ ఎమ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు అర్థరహితం

ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి కె.మురళీ అన్నారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ కోటేశ్వరరావు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బుచ్చిరెడ్డిపాళెం సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. ఈమేరకు విడవలూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించే అవకాశం ఉందని, ఇలాంటివి ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆనంద్‌భాస్కర్ బాబు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న భక్తులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు గావించారు. దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గోవిందనామస్మరణలతో దేవస్థానం మారుమోగింది.

వేధిస్తోన్న ట్రాఫిక్ సమస్య

• బారులు తీరుతున్న వాహనాలు



పట్టణంలో అడ్డదిడ్డంగా నిలిపిన ఆటోలు

పొదలకూరు : పట్టణంలో ట్రాఫిక్ రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవలి కాలంలో వాహనాల రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణానికి ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో దాదాపుగా వాహనాలన్నీ పట్టణం మీదుగా వెళ్లాల్సి ఉంది. దీంతో చుట్టుపక్కల నాలుగు మండలాల నుంచి ఇదే మార్గంలో వాహనాలు వెళ్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. దీనికి తోడు పదుల సంఖ్యలో ఆటోలు, కంకర లారీల తాకిడి అధికంగా ఉంది. అంతేకాకుండా ఆటోలను ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సుమారు అరగంట సేపు నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, రామనగర్‌గేటు సెంటర్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రావెల్, కంకర లారీలు ఇదేమార్గంలో వెళ్తుండడం వల్ల ఇరుకుగా ఉన్న రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో కొన్ని సందర్భాల్లో వాహనాలు బారులు తీరుతున్నాయి.

నాలుగు లేన్లే శరణ్యం

పట్టణంలో నాలుగు లేన్ల విస్తరణ పనులు జరుగుతాయని కొద్దిరోజులు ప్రచారం జరిగింది. దీనిపై అధికారులెవరూ స్పష్టత ఇవ్వడం లేదు. గతంలో నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల కోసం ఇంజినీర్లు సర్వే నిర్వహించారు. నాలుగు లేన్ల రోడ్డు అయితేనే శరణ్యమని పట్టణవాసులు అంటున్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

• మంత్రి చేతుల మీదుగా అందజేత

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతులమీదుగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉదయం 10 గంటలకు కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పింఛన్ లబ్ధిదారులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

మనుబోలు : స్థానిక డీపీఆర్ కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు కొత్త పింఛన్లను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంపిణీ చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి తెలిపారు.

తోటపల్లిగూడూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పింఛన్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ హేమలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తా పడి వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని కండలపాడు వద్ద బుధవారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరానికి చెందిన ఇస్మాయిల్ మోటారు బైక్‌లో కసుమూరు వైపు వెళ్తుండగా గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్‌కు గాయాల్వగా స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరులో సెబ్ సర్కిల్ కార్యాలయం

పొదలకూరు : పట్టణంలోని నెల్లూరు మార్గంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. చాలాకాలంగా రాపూరులో ఉన్న కార్యాలయాన్ని ఇక్కడకు మార్చారు. పొదలకూరు పట్టణం చుట్టుపక్కల మండలాలకు కేంద్రంగా ఉన్నందున ఇక్కడకు మార్చాల్సి వచ్చినట్లు సెబ్ ఇన్‌చార్జి సీఐ సీహెచ్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. తమ సర్కిల్ పరిధిలోకి రాపూరు, పొదలకూరు, చేజర్ల, కలువాయి మండలాలతో పాటు కొత్తగా సైదాపురం మండలాన్ని కూడా చేర్చినట్లు వెల్లడించారు. గతంలో పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాలకు కలిపి రాపూరులో సెబ్ కార్యాలయం ఉండేది. అయితే కలువాయి, చేజర్ల మండలాలకు కార్యాలయం దూరంగా ఉండేది. అన్ని మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న పొదలకూరును ఎంపిక చేసి సెబ్ కార్యాలయాన్ని నూతన సంవత్సరంలో ఉన్నతస్థాయి అధికారులు ఆదేశాలతో ఏర్పాటు చేశారు.

బాబు అడుగు పెడితే మారణహోమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎల్లో మీడియావి పిచ్చిరాతలు
• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : రాష్ట్రంలో చంద్రబాబు ఎక్కడ అడుగు పెట్టినా మారణహోమం జరుగుతోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు సభలు, సమావేశాలకు జనం రాకపోతే పక్క ప్రాంతాల నుంచి తోలుకుని వారి ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సభలు, రోడ్ షోలతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని, వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండడంతో కూడలిలో సభలు, సమావేశాలకు అనుమతి లేనిదే నిర్వహించరాదని జీఓను విడుదల చేశారన్నారు. ఇది వైఎస్సార్‌సీపీకి కూడా వర్తిస్తుందని, అయితే దీనిపై ఎల్లో మీడియా పిచ్చిరాతలు రాస్తున్నట్లు తెలిపారు. ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభలకు మాత్రమే ప్రజలు డబ్బుతో సంబంధం లేకుండా స్వచ్ఛందంగా వస్తారన్నారు. అంతే తప్ప చంద్రబాబు పెట్టే సభలకు జనం వచ్చేందుకు ఇష్టపడరన్నారు. ప్రజల ప్రాణాలను హరించే రోడ్ షోలు, సభలు మానేస్తే బాగుంటుందనేది నా వ్యక్తిగత ఉద్దేశమన్నారు. ఎక్కడైనా సభలు పెట్టుకోవాలంటే పోలీసుల అనుమతి తీసుకుని నిర్వహించుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఇంత మంది చనిపోతే పవన్ కల్యాణ్ ఇప్పటివరకు కనిపించకుండా ఉండటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, కోవూరు సర్పంచ్ విజయ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులో ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కోవూరు నియోజకవర్గంలో 45 సచివాలయాల పరిధిలో బుధవారం నాటికి 49,331 గడపలు తిరిగామని ఎమ్మెల్యే తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



గుంతలను పూడ్చి రోలింగ్ చేసిన రోడ్డు



నెల్లూరు రోడ్డులో జరుగుతున్న ప్యాచ్ వర్క్

• యుద్ధప్రాతిపదికన 400 మీటర్ల ప్యాచ్ వర్క్

పొదలకూరు : పొదలకూరు–నెల్లూరు మార్గం తోడేరు క్రాస్‌రోడ్డుకు సమీపంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. వర్షాలకు ముందు ఇక్కడ ప్యాచ్ వర్క్ చేపట్టారు. అయితే మాండూస్ తుపాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలు కురవడంతో ప్యాచ్ పనులు చేపట్టిన ప్రాంతంలో గుంతలు పడ్డాయి. దీంతో వాహనాల్లో వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. దీనికితోడు అడపాదడపా వర్షాలు కురవడంతో గుంతలు మరింతగా పెరిగాయి. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడిన మంత్రి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా సూచించారు. దీంతో పండగల సందర్భంగా వాహనచోదకులకు ఇబ్బందులు తలెత్తకుండా శరవేగంగా రోడ్డు రిపేర్లను చేస్తున్నారు. 400 మీటర్ల వరకు గుంతలు పడిపోవడంతో ముందుగా గుంతలను పూడ్చి హాట్‌మిక్సింగ్ చేపట్టనున్నట్లు పొదలకూరు ఆర్అండ్‌బీ డీఈ సురేఖ వెల్లడించారు. నెల్లూరు–పొదలకూరు రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరై ఉందని, త్వరలో పనులు చేపడుతామని ఆమె పేర్కొన్నారు.

'వైఎస్సార్ కల్యాణమస్తు'పై అవగాహన కల్పించండి

• డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని

కొడవలూరు : సచివాలయ ఉద్యోగులు 'వైఎస్సార్ కల్యాణమస్తు' పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని సూచించారు. మండలంలోని గండవరం సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కల్యాణమస్తు పథకం కింద ఎస్సీ, ఎస్టీల వివాహానికి రూ.లక్ష చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. కులాంతర వివాహమైతే మాత్రం రూ.1.20 లక్షలు చెల్లిస్తారని చెప్పారు. మైనారిటీల వివాహానికి రూ.లక్ష, బీసీలకు రూ.50 వేలు, బీసీలు, కులాంతర వివాహమైతే రూ.75 వేలు వంతున చెల్లిస్తారన్నారు. ఈ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలన్నారు. ఉదయం పదిన్నర లోపు తప్పక బయోమెట్రిక్ వేయాలన్నారు. సర్వీసుల నగదు ఎప్పటికప్పుడు బ్యాంక్‌లో జమ చేయాలని చెప్పారు. వలంటీర్‌లు వారంలో మూడ్రోజులు విధిగా సచివాలయంలో వేలిముద్ర వేసేలా చూడాల్సిన బాధ్యత కూడా సిబ్బందిపైనే ఉందని స్పష్టం చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పింఛన్ల మంజూరులో అర్హతే ప్రామాణికం

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



తలమంచికి చెందిన టీడీపీ నేతకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



విడవలూరులో కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు : సామాజిక పింఛన్‌ల మంజూరులో అర్హతే ప్రామాణికమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలో నూతనంగా మంజూరైన 240 పింఛన్‌లను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్ మంజూరు చేయాలంటే ఎవరైనా పింఛనుదారు మరణిస్తే తప్ప వీలయ్యేది కాదన్నారు. అయితే ప్రస్తుతం అర్హతే ప్రామాణికంగా పింఛన్లను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. కోవూరు నియోజకవర్గంలో కొత్తగా 1557 పింఛన్‌లు మంజూరవ్వగా, వీరికి నెలకు రూ.43.20 లక్షలు అదనంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 42,910 మందికి పింఛన్‌లు ఇస్తున్నామని, వీరికి నెలసరి రూ.11.90 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్, డీఏబీ చైర్మన్‌లు వీరి చలపతిరావు, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రమణ్యం, ఎమ్మెల్యే తనయుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ ఎస్.కామాక్షి పాల్గొన్నారు.

మాట నిలుపుకున్న సీఎం జగన్

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : ఇచ్చిన మాటపై నిలబడి పింఛన్ పెంచిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. విడవలూరు ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 254 పింఛన్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, రామిరెడ్డి విజయభానురెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రూ.1.92 కోట్ల బ్యాంకు రుణాలు మంజూరు

మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు రూ.1.92 కోట్ల బ్యాంకు రుణాల చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. మండలంలోని 14 పొదుపు సంఘాలకు రూ.1.92 కోట్ల రుణాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాయకులు ప్రసాద్, ప్రభాకర్, ప్రసాద్‌రెడ్డి, చంద్రారెడ్డి, వాసు, తిరుపతి, లక్ష్మీనారాయణరెడ్డి, వివేకానందరెడ్డి, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.